సాక్షి
కర్నూలు

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024



వలంటీర్ల ధర్నా

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని సోమవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట వలంటీర్లు ధర్నా చేపట్టారు. 8లో▸



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం విజయవాడకు చెందిన అడుసుమల్లి వెంకట రమణయ్య రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632.00
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:11,051
అవుట్ ఫ్లో	:10,571

న్యూస్‌రీల్

హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి



వివరాలు తెలుసుకుంటున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీ లీలా వెంకటశేషాద్రి అన్నారు. సోమవారం ఆయన స్థానిక కలెక్టరేట్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. వంటగది, రికార్డులు, ఆహార పదార్థాలు, సరుకులు తదితర వాటిని పరిశీలించారు. హాస్టల్ పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, టాయ్‌లెట్ల సమస్య కూడా ఉందని వసతి గృహాల సంక్షేమాధికారులు డీపీ సులోచన, రజినమ్మ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

నూతన సర్కిళ్లకు అధికారుల కేటాయింపు

కర్నూలు న్యూసిటీ: కొత్త జిల్లాలలో నూతనంగా ఏర్పడిన విద్యుత్ కొత్త సర్కిళ్లకు అధికారులను నియమిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సంతోషరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలోని ఒక్కో సర్కిల్‌కు జనరల్ మేనేజర్, పర్యవేక్షక ఇంజినీర్, అకౌంటెంట్ ఆఫీసర్, పర్సనల్ ఆఫీసర్లను నియమించారు. నాలుగు జిల్లాలకు 16 మంది ఈఈలు, 82 మంది డీఈఈలను కేటాయించారు. వారితోపాటు ఏఓ, ఏఏఓ, పీఓ, ఏఈఈ, ఏఈలు, జేఈలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దసరా ఉత్సవాలకు ఆహ్వానం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీగిరిలో అక్టోబర్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే దసరా మహోత్సవాలకు తరలిరావాలని పలువురు ప్రముఖులకు దేవస్థానం అధికారులు సోమవారం ఆహ్వానపత్రికలు అందజేశారు. రాష్ట్ర మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులను వేదపండితులు, అర్చకులు కలసి ఆహ్వాన పత్రికలను అందజేసి ఉత్సవాలకు ఆహ్వానించారు. వేదాశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

పెంచినట్లే పెంచి కోతలు!

మొదలైన పింఛన్ల తొలగింపులు

- మూడు నెలల్లో 6,321 పింఛన్ల కోత
- ఎన్నికల సమయంలో 50 ఏళ్లకే పింఛన్లని హామీ
- ఇప్పటి వరకు జాడలేని కొత్త పింఛన్లు
- ప్రతీ వారం గ్రీవెన్స్‌కు దరఖాస్తుల వెల్లువ
- ఎప్పుడిస్తారని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

అధికారం చేజిక్కించుకునేందుకు చంద్రబాబునాయుడు ఎలాంటి గిమ్మిక్కులు చేస్తారో ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది. ఇప్పటికే ఈ విషయం గత ఎన్నికల్లో తెలిసొచ్చినా, నమ్మి మరోసారి ఓట్లేసిన ప్రజలను ఎప్పటిలానే టీడీపీ ప్రభుత్వం మోసగిస్తోంది. సూపర్–6 పథకాల పేరిట అరచేతిలో వైకుంఠం చూపిన కూటమి నేతలు.. ఇప్పుడు ఆ మాటే మరిచారు. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడని పరిస్థితి. ఎన్నికలకు ముందు కాళ్లావేళ్లా పడిన చంద్రబాబు, తాను ప్రకటించిన సూపర్–6 హామీలను చూస్తే తనకే భయమేస్తుందని ప్రకటించుకోవడం గమనార్హం.

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం ఏర్పాటై రోజులు, నెలలు గడుస్తున్నాయే కానీ హామీలు మాత్రం ఎక్కడికక్కడే ఉండిపోతున్నాయి. పింఛన్ల విషయంలో రూ.3వేల నుంచి రూ.4వేలకు పెంచామన్న మాటే కానీ, కొత్త పింఛన్ల జాడ లేకపోవడంతో ఎంతో మంది అర్హులు ఆ రోజు కోసం నిరీక్షిస్తున్నారు. కొత్త పింఛన్లు దేవుడెరుగు గత ప్రభుత్వంలో ఇచ్చిన పింఛన్లను సైతం ప్రతినెలా వేల సంఖ్యలో కోత పెడుతుండటం గమనార్హం. ఈ ఏడాది మే నెలలో జరిగిన ఎన్నికల సమయంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామనే హామీని ఊదరగొట్టారు. ఇప్పటికి నాలుగు నెలలు గడిచినా ఆ ప్రస్తావనే లేకపోవడంతో అవ్వాతాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు అవ్వాతాతలు దాదాపు 2.50 లక్షల మంది వరకు ఉన్నారు. వీరిలో 60 శాతం మంది పింఛనుకు అర్హులే. ప్రతి సోమవారం కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయి. జూన్ నెల 12వ తేదీ నుంచి ఇప్పటి వరకు కొత్త పింఛన్ల కోసం దాదాపు 56 వేల దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త పింఛన్లు ఎప్పుడంటూ వృద్ధులు, వికలాంగులు గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంపీడీవో కార్యాలయాలు, డీఆర్‌డీఏ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ప్రభుత్వం హామీ నిలుపుకోవాలి




ఎన్నికల సమయంలో 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛన్లు ఇస్తామని ప్రకటించారు. మాది నిరుపేద కుటుంబం. పత్తికొండలో హమాలి పనులు చేసేటోడిని. ఇప్పుడు మోకాళ్ల నొప్పులతో ఆ పని మానుకున్నా. కుటుంబం గడువాలంటే ఇబ్బందిగా ఉంది. నా వయస్సు 54 ఏళ్లు. వృద్ధాప్య పింఛనుకు అర్హత ఉంది. ప్రభుత్వం హామీ నిలుపుకుంటే నా కుటుంబానికి ఆసరాగా ఉంటుంది. – గిత్తిరి ఈశ్వరయ్య, హోసూరు గ్రామం, పత్తికొండ మండలం

నాకు అన్నివిధాల అర్హత ఉంది



నా వయస్సు 55 ఏళ్లు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రకటించిన విధంగా నేను వృద్ధాప్య పింఛనుకు అర్హుడిని. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం ఏర్పాటై 110 రోజులు గడిచినా ఇప్పటి వరకు ముఖ్యమంత్రి ఆ మాటే ఎత్తడం లేదు. కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారో, మా బతుకుల్లో ఎప్పుడు సంతోషం నింపుతారో తెలుస్తలేదు. నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసగించడం సరికాదు. – కాశీం, మద్దికెర



పింఛన్లలో భారీగా కోత

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నెల నెలా పింఛన్లలో భారీగా కోత పడుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ ఏడాది జూన్ నెలతో పోలిస్తే అక్టోబర్ నెల పింఛన్లలో 6,321 కోత కోశారు. పింఛన్‌లను అడ్డగోలుగా తొలగిస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఏడాది జూన్ నెలలో 4,67,389 పింఛన్లు ఉన్నాయి. అక్టోబర్ నెలలో ఈ సంఖ్య 4,61,068కి చేరుకుంది. అంటే కేవలం మూడు నెలల వ్యవధిలోనే 6,321 పింఛన్లు కోత కోశారు. కర్నూలు జిల్లాలో 3,844, నంద్యాల జిల్లాలో 2,477 చొప్పున పింఛన్లను తొలగించారు. వీరంతా అనర్హులని ప్రభుత్వం భావిస్తే.. ఆ స్థానంలో కొత్త పింఛన్‌లు ఇచ్చినా కొంత మందికైనా న్యాయం జరిగేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



కొత్త పింఛన్లు ఎప్పుడు

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తున్న ఈ వృద్ధురాలి పేరు ఈరపోగు ఈరమ్మ. పోలకల్లులో గత మంగళవారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఊహించని విధంగా ఆమె ప్రశ్నించడంతో టీడీపీ శ్రేణులు అవాక్కయ్యారు. తన భర్త ఎన్నికల సమయంలో మృతి చెందాడని, పింఛన్ మంజూరు చేయాలని కనిపించిన ప్రతి ఒక్కరినీ అడుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోయింది. అయితే సమాధానం చెప్పేందుకు నీళ్లు నమిలిన ఎమ్మెల్యే.. గత ప్రభుత్వంలో ఎందుకు అడగలేదని ఎదురు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఆమె భర్త చనిపోతే గత ప్రభుత్వాన్ని ఎలా అడుగుతుందో ఆయనకే తెలియాలని ప్రజలు చర్చించుకోవడం గమనార్హం.

గత ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్‌లు



వైఎస్సార్‌సీపీ పాలనలో ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్‌లు ఇవ్వడం విశేషం. ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్‌లను అర్హులైన వారందరికీ మంజూరయ్యాయి. రాజకీయాలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా పింఛన్‌లు ఇస్తూ వచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేకుండా, ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా పింఛను ఇంటి తలుపు తట్టింది. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో కొత్త పింఛన్‌లు 1.20 లక్షలకుపైగా మంజూరు చేసిన విషయాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

చంద్రబాబు చెప్పినట్లు మళ్లీ పాతరోజులే..

2014–15 నుంచి 2018–19 వరకు ఉన్న టీడీపీ పాలనలో కొత్త పింఛన్ పొందాలంటే తలప్రాణం తోకకు వచ్చేది. జన్మభూమి కమిటీలను ముడుపులతో ప్రసన్నం చేసుకుంటేనే పింఛన్ మంజూరయ్యేది. నేడు కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. జనవరి నుంచి మళ్లీ జన్మభూమి–2 కార్యక్రమం చేపడుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. అంటే జన్మభూమితో పాటే జన్మభూమి కమిటీలు కూడా రాబోతున్నాయనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ప్రజలు మళ్లీ వాళ్ల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సిందేననే చర్చ జరుగుతోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి పాత చంద్రబాబును చూస్తారని ప్రకటించడం, తాజా పరిస్థితులు ఆ దిశగానే కనిపిస్తుండటం చూసి ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

నేడు పత్తికొండకు సీఎం చంద్రబాబు

- పుచ్చకాయలమాడలో ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు పత్తికొండ పర్యటనకు సర్వం సిద్ధమైంది. పుచ్చకాయలమాడలో ఇంటింటా ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో ఆయన పాల్గొంటారు. అనంతరం గ్రామంలోని కాశీశ్వరుడి గుడిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. తరువాత అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ ప్రదేశంలో గ్రామస్తులతో ముఖాముఖిగా మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. సీఎం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్ ఎయిర్‌పోర్టు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో పుచ్చకాయలమాడకు వస్తారు. ఇందుకోసం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెలిప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. కాగా సెప్టెంబర్ ఒకటో తేదీనే చంద్రబాబునాయుడు పుచ్చకాయలమాడలో ఇంటింటా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. అయితే అప్పట్లో భారీ వర్ష సూచన నేపథ్యంలో పర్యటన అర్ధాంతరంగా రద్దయింది. మళ్లీ అక్టోబర్ 1వ తేదీన అదే ప్రాంతానికి సీఎం వస్తుండటం, ఇప్పుడు వర్ష సూచన ఉండటంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది.

కుక్కల దాడిలో 33 మంది చిన్నారులకు గాయాలు





చిన్నారులను చికిత్స కోసం పెద్దాసుపత్రికి తీసుకొచ్చిన దృశ్యం

- కర్నూలులోని పాతబస్తీలో ఘటన

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు పాతబస్తీలోని పలు వీధుల్లో కుక్కలు దాడి చేయడంతో 30 మందికి పైగా చిన్నారులు గాయపడ్డారు. స్థానిక వన్‌టౌన్ ప్రాంతంలోని గడ్డా వీధి, గరీబ్ నగర్, చిత్తారి వీధి, బండిమెట్ట ప్రాంతాల్లో సోమవారం రాత్రి కుక్కలు స్వైర విహారం చేశాయి. కనిపించిన పిల్లలను కనిపించినట్లు కొరికాయి. అడ్డుకోబోయిన వారిపైనా దాడి చేశాయి. చాలామంది పిల్లలకు గొంతు, చేతులు, వీపు, కాళ్లు, నడుము దగ్గర గాయాలయ్యాయి. వీరిని తల్లిదండ్రులు హుటాహుటిన కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఏఆర్‌వీ ఇంజెక్షన్లను వేశారు. గాయపడిన చిన్నారులంతా ఐదారు సంవత్సరాల్లోపు వయస్సు వాళ్లే. కుక్కలు దాడి చేస్తున్నాయని పోలీసులతో పాటు మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి చెప్పినా ఎవరూ స్పందించలేదని బాధిత చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పాతబస్తీలో మనుషుల కంటే కుక్కల సంఖ్యే ఎక్కువగా ఉందని, వీటిని అరికట్టాలని కన్నీరు పెట్టుకున్నారు. ఇదిలాఉంటే బాధిత చిన్నారులను మంత్రి టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పరామర్శించారు. గాయపడిన ఒక్కో చిన్నారికి రూ.10వేల చొప్పున పరిహారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



ఏఆర్‌వీ ఇంజెక్షన్ల గది వద్ద చిన్నారులతో వేచి ఉన్న కుటుంబీకులు

కూటమి కూల్చిన బతుకులు

- అక్టోబర్ మొదటి వారం నుంచి నూతన మద్యం పాలసీ
- ప్రభుత్వ మద్యం దుకాణాల ఔట్ సోర్సింగ్ సిబ్బందిపై స్పష్టత కరువు
- ప్రశ్నార్థకంగా మారిన 954 మంది భవితవ్యం



1వ తేదీ నుంచి విధులకు రావడం లేదని ఐఎంఎల్ డిపో మేనేజర్ శ్రీధర్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న మద్యం దుకాణాల సూపర్‌వైజర్లు

కర్నూలు: కూటమి సర్కార్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి అంతా ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమయ్యింది. ఈ క్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న 954 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. వారిపైనే ఆధారపడిన కుటుంబం, అనారోగ్యంతో బాధ పడుతున్న వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను తలుచుకుని ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగం ఉంటుందో లేదో తెలియక మానసిక వేదన అనుభవిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 175 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో 175 మంది సూపర్‌వైజర్లు, 490 మంది సేల్స్‌మెన్లు, 200 మంది వాచ్‌మెన్లు ఔట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో దుకాణంలో ఒక సూపర్‌వైజర్, ముగ్గురు సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ పనిచేస్తున్నారు. మండల కేంద్రాల్లోని మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్, ఇతర సేల్స్‌మెన్లు, ఒక వాచ్‌మెన్ ఉన్నారు. వీరందరినీ గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. ఐదేళ్లుగా వీరంతా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. సూపర్‌వైజర్‌కు రూ.19 వేలు, సేల్స్‌మెన్‌కు రూ.16,500, వాచెమెన్‌కు రూ.12 వేల చొప్పున ఇప్పటివరకు వేతనం ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అక్టోబర్ మొదటి వారం నుంచి నూతన మద్యం పాలసీ పేరుతో దుకాణాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించనుండటంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. గత ఐదు సంవత్సరాలుగా మద్యం దుకాణాల్లో పనిచేసిన వీరు ఉద్యోగ భద్రత కోసం గత కొంతకాలంగా అధికారులతో సంప్రదింపులు జరిపినప్పటికీ కొనసాగింపుపై కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో వారి భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. 2022 జనవరి 17న జీవో నెం.7ను అనుసరించి సూపర్‌వైజర్‌ను కేటగిరీ1ను సేల్స్‌మెన్స్‌ను కేటగిరీ2లో చేర్చి గత ప్రభుత్వం వేతనాలు చెల్లించింది. అయితే వీరి ఒప్పందం (అగ్రిమెంట్) 30వ తేదీ రాత్రితో ముగిసింది. ఇకపై ఇప్పటి వరకు అనుకూల అధికారిక ప్రకటన ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో అక్టోబర్ 1వ తేదీ నుంచి విధులకు హాజరు కామని కర్నూలు ఐఎంఎల్ డిపో మేనేజర్ శ్రీధర్‌రావును కలసి వినతిపత్రం సమర్పించారు.



☛ చిత్రంలోని వ్యక్తి కర్నూలుకు చెందిన ఎం.శివకుమార్. ప్రభుత్వ మద్యం దుకాణంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కోసం అప్పటికే ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న ఉద్యోగాన్ని మానేశాడు. ప్రస్తుతం ఆటో నగర్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే కూటమి సర్కారు ప్రభుత్వ దుకాణాలను ప్రైవేటు పరం చేస్తున్న క్రమంలో తన ఉద్యోగం ఉంటుందా.. ఉండదా అనేది తెలియక మానసిక ఆందోళన చెందుతున్నాడు.



☛ ఇతని పేరు సతీష్. కల్లూరు మండలం చెట్లమల్లాపురం సొంతూరు. గతంలో స్వగ్రామంలోని పాఠశాలలో పార్ట్ టైమ్ టీచర్‌గా పనిచేసేవాడు. ప్రస్తుతం కల్లూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పక్కనున్న మద్యం దుకాణంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో ప్రైవేటు దుకాణాలకు అనుమతి ఇస్తున్న నేపథ్యంలో తన ఉద్యోగంపై నీలినీడలు కమ్ముకోవడంతో భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

కల్తీ మద్యం అరికట్టి.. ఉపాధి కల్పించి..

2014 నుంచి 2019 వరకు రెండేళ్లకోసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేవారు. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించేవారు. కొన్నింటికి డిమాండ్ ఉండేది. మరికొన్నింటికి అంత డిమాండ్ ఉండేది కాదు. పేరుకు లాటరీ పద్ధతే అయినప్పటికీ మద్యం వ్యాపారమంతా టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే నడిచేది. దీంతో కొందరు కల్తీ మద్యంతో పాటు అధిక ధరలకు మద్యం విక్రయించేవారు. దీనికి స్వస్తి పలుకుతూ 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దుకాణాలన్నీ ప్రభుత్వం ఆధీనంలోనే నడిచే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎక్కడా కల్తీ మద్యం కానీ, అధిక ధరలకు మద్యం అమ్ముతున్నారనే ఫిర్యాదులు, ఆరోపణలు రాలేదు. మద్యం దుకాణాల ద్వారా ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. ఆ వచ్చిన జీతంతో వారంతా సంతోషంగా గడిపారు. కొత్త మద్యం పాలసీ విధానంతో అందులో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కొనసాగిస్తారా లేదంటే తొలగిస్తారా అనేదానిపై ప్రభుత్వం ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాల వివరాలు

జిల్లా	కర్నూలు	నంద్యాల
మద్యం దుకాణాలు	96	79
సూపర్‌వైజర్లు	96	97
సేల్స్‌మెన్లు	270	291
వాచ్‌మెన్లు	110	90
బార్లు	27	22

కొత్త పాలసీకి వ్యతిరేకం కాదు

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త మద్యం పాలసీకి తాము వ్యతిరేకం కాదు. ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగిస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల మంది కుటుంబాలు రోడ్డున పడే అవకాశముంది. ప్రభుత్వం పునరాలోచన చేసి ప్రభుత్వంలోని వేరొక శాఖలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు కల్పించాలి. – జతిన్ చంద్రారెడ్డి, ఏపీఎస్బీ సీఎల్ సూపర్‌వైజర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

క్లుప్తంగా

8 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభిక్ వర్గ

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ ప్రారంభిక్ వర్గ –2024 ను ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ్ కె.చంద్రశేఖర్ తెలిపారు. బి. తాండ్రపాడులోని క్రైడో స్కూల్‌లో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటర్, ఆపై చదువుతున్న విద్యార్థులు, 16 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గలవారు ఇందులో పాల్గొన వచ్చని పేర్కొన్నారు. యువత వ్యక్తిగత జీవితానికి అవసరమైన వ్యాయామాలు, యోగా, ఆటలు, కథలు, శారీరక, మానసిక వికాసం, దేశభక్తిని పెంపొందించే అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 92469 21926, 97017 25066 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎల్లెల్సీలో పడి యువకుడి మృతి



సమీర్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: పట్టణ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ సమీపంలోని ఎల్లెల్సీ కెనాల్లో ప్రమాదవశాత్తు ఓ యువకుడు పడి మృతి చెందాడు. వివరాలు..పట్టణంలోని కబరస్తాన్ ప్రాంతానికి చెందిన కటికె మదర్‌సా కుమారుడు కటికె సమీర్ (23) స్నేహితులు మహబుబ్, ఉస్మాన్‌లు కలిసి స్నానం చేయడానికి వెళ్లారు. స్నానం చేస్తుండగా ఫిట్స్ రావటంతో కాలువలో కొట్టుకుపోయాడు. స్నేహితులు గమనించి గాలించగా ఆచూకీ తెలియకపోవటంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని అగ్నిమాపక పోలీసుల సహకారంతో కాలువలో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వకపోవటంతో కేసు నమోదు చేయలేదని పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి సోమవారం సాయంత్రం తెలిపారు.

14 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 14 మండలాల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు వర్షం కురిసింది. గూడూరులో అత్యధికంగా 70.8 మి.మీ వర్షపాతం నమోదైంది. హాలహర్విలో 32.8, హొళగుందలో 26.2, గోనెగండ్లలో 23.2, ఆలూరులో 14.2 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. సెప్టెంబర్ నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా 97.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

అతిగా మద్యం తాగి ..



కోడుమూరు రూరల్: గూడూరు పట్టణంలోని పడమర బీసీ కాలనీ సమీపంలో సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన మాదిగరాజు (25) కోడుమూరులోని ఓ గుజరీ దుకాణంలో పనిచేస్తూ గూడూరు మండలం చనుగొండ్లలో నివాసముంటున్నాడు. తాగుడుకు బానిసైన ఈ యువకుడు ఆదివారం గూడూరుకు వెళ్లాడు. అక్కడ పూటుగా మద్యం తాగి పడమర బీసీ కాలనీ సమీపంలో పడిపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడికి వివాహమైనప్పటికీ భార్య విడిచిపెట్టినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

కోత.. వాత!

- శనగ విత్తనాల కేటాయింపుల్లో సర్కారు నిర్లక్ష్యం
- రబీ సీజన్‌కు 60,068 క్వింటాళ్లు అవసరం
- 45,955 క్వింటాళ్లు మాత్రమే కేటాయింపు
- సబ్సిడీలోనూ 15 శాతం తగ్గింపు
- నేటి నుంచి రబీ సీజన్ మొదలు
- ఆందోళనలో రైతన్నలు

శనగ విత్తనాల అవసరం, కేటాయింపులు ఇలా..

సబ్ డివిజన్	అవసరం (క్వింటాళ్లలో)	కేటాయింపు
కర్నూలు	13562	8595
ఆదోని	655	655
ఎమ్మిగనూరు	1290.25	1350
ఆలూరు	34068	22385
పత్తికొండ	10493.25	8710
మొత్తం	60,068.5	41695



కోడుమూరులో రైతులు గత ఏడాది సాగు చేసిన పంట (ఫైల్)

కర్నూలు(అగ్రికల్చర్)/కోడుమూరు రూరల్: రబీలో శనగ ప్రధాన పంట. జిల్లాలో దాదాపు 70 వేల హెక్టార్లలో ఈ పంట సాగు చేస్తారు. అయితే, కూటమి ప్రభుత్వం డిమాండ్‌కు అనుగుణంగా విత్తనాలు కేటాయించకపోగా సబ్సిడీలోనూ కోత వేసింది. దీంతో ఈసారి శనగ సాగుచేయాలనుకున్న రైతులకు దిక్కుతోచడం లేదు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు రబీలో రైతులకు అవసరం మేరకు శనగలు పంపిణీ చేయడంతో పాటు 40 శాతం సబ్సిడీ ఇచ్చింది. దీంతో రైతులకు చాలా మేలు జరిగింది. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం శనగల కేటాయింపులు, సబ్సిడీ భారీగా తగ్గించింది. రబీలో శనగ సాగుకు 54,979.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు. సర్కారు మాత్రం జిల్లాకు 45,955 క్వింటాళ్లే కేటాయించింది. మంగళవారం నుంచి రబీ సీజన్ మొదలు కానుంది. జిల్లాలో నల్ల రేగడి నేలలు ఎక్కువగా ఉండటం వల్ల శనగ సాగు ఎక్కువగా ఉంటోంది. అనేక మంది రైతులు ఈ పంట సాగు కోసం ఖరీఫ్‌లో భూములను ఖాళీగా ఉంచుకుంటారు. జిల్లాలో వర్షాలు పడుతుండటంతో ప్రస్తుతం రబీ సీజన్‌కు సానుకూల వాతావరణం ఏర్పడింది. అయితే, విత్తనాలదే ప్రధాన సమస్యగా మారింది. సబ్సిడీపై పంపిణీ చేసే శనగలకు అధిక ధర నిర్ణయించి సబ్సిడీ 25 శాతానికే పరిమితం చేయడంతో రైతులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

సబ్సిడీ పోనూ కిలోకు రూ.70.50 చెల్లించాలి

సబ్సిడీపై వ్యవసాయ శాఖ జేజీ–11 రకం శనగ విత్తనాలను పంపిణీ చేస్తోంది. క్వింటాలు శనగలు బహిరంగ మార్కెట్‌లో రూ.7000 వరకు ఉంటోంది. ప్రభుత్వం మాత్రం రైతులకు పంపిణీ చేసే శనగ విత్తనాల ధరను కిలో రూ.94 నిర్ణయించింది. (క్వింటాలు ధర రూ.9400), ఇందులో 25 శాతం సబ్సిడీ ఇస్తోంది. కిలోకు 25 శాతం ప్రకారం సబ్సిడీ రూ.23.50 ఉంటుంది. సబ్సిడీ పోగా... రైతులు కిలోకు రూ.70.50 చెల్లించాల్సి ఉంది. బహిరంగ మార్కెట్‌లో కూడా ఇదే ధరకు లభిస్తుండటంతో రైతులకు కలిగే ప్రయోజనం శూన్యం.

అరకొరగా కేటాయింపులు

2023–24 రబీలో శనగ 57432.60 హెక్టార్లలో సాగు అయింది. ఈ సారి 70 వేల హెక్టార్లలో సాగు అయ్యే అవకాశం ఏర్పడింది. జిల్లాకు 54,979 క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరం కాగా.. ప్రభుత్వం 45,955 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. ఇందులో 4,260 క్వింటాళ్ల శనగ విత్తనాలను బఫర్‌లో ఉంచి సాగు విస్తీర్ణాన్ని బట్టి జిల్లా వ్యవసాయ యంత్రాంగం మండలాలకు 41,695 క్వింటాళ్లు కేటాయించింది. అత్యధికంగా ఆలూరు సబ్ డివిజన్‌కు 22,385 క్వింటాళ్లు కేటాయించింది. ఈ సబ్ డివిజన్‌కు 34,068 క్వింటాళ్ల శనగ విత్తనాలు అవసరమని అధికారులు కోరారు. కర్నూలు సబ్ డివిజన్‌లో ఆరు మండలాలు ఉన్నాయి. గత ఏడాది రబీలో 13,562.40 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. కాని ఈ సారి 8,595 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. అన్ని మండలాలకు అడిగిన దాని కంటే తక్కువగా కేటాయించడంతో రైతులతో పాటు వ్యవసాయ అధికారులు పెదవి విరుస్తున్నారు.

ఎరువుల ఊసే లేదు.

రబీ సీజన్ సాధారణ సాగు 1,10,386 హెక్టార్లు ఉంది. ఇందులో అత్యధికంగా శనగ సాగు అవుతోంది. రబీ పంటల సాగుకు 98,389 టన్నుల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. యూరియా 33855 టన్నులు, డీఏపీ 8819 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 46711 టన్నులు, ఇతర ఎరువులు 9004 టన్నులు అవసరమవుతాయని అంచనా వేసి వ్యవసాయ శాఖ కమిషనర్‌కు పంపారు. ఆ శాఖ ఇప్పటి వరకు సప్లై ప్లాన్ ఇవ్వలేదు. యూరియాకు ఇప్పటికే కొరత ఏర్పడింది. రానున్న రోజుల్లో కొరత మరింత ఏర్పడే అవకాశం ఉంది.

పంటల సాధారణ సాగు వివరాలు

పంట పేరు	సాధారణ సాగు (హెక్టార్లలో)
శనగ	69041
జొన్న	10080
వరి	4440
వేరుశనగ	15499
మొక్కజొన్న	6070
పొగాకు	1743
సజ్జ	769
కొర్ర	1242
మినుము	731
ఇతర పంటలు	771
మొత్తం	1,10,386

రైతులకు దగా



ఖరీఫ్‌లో వానల్లేక కొర్రల దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వచ్చింది. ప్రస్తుతం ఆరున్నర ఎకరాల్లో శనగలు సాగు చేసుకుందా మనుకుంటే ప్రభుత్వం సబ్సిడీ తగ్గించి రైతులను దగా చేస్తోంది. బయట మార్కెట్లో ప్రస్తుతం శనగలు క్వింటాలు రూ.7,200 పలుకుతుంటే ప్రభుత్వం కూడా సబ్సిడీ శనగల ధర రూ.7050 ప్రకటించడం దారుణం. ఈమాత్రం దానికి ప్రభుత్వం ఎందుకు సబ్సిడీ ఇవ్వాలి. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.4,860కే క్వింటం సబ్సిడీ శనగ లిచ్చి ఆదుకున్నారు.

– రైతు నవీన్‌కుమార్‌రెడ్డి, కోడుమూరు

వలంటీర్ వ్యవస్థపై నోరు మెదపరేం



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుటు ధర్నా చేపట్టిన వలంటీర్లు

- రూ.10 వేల వేతనం హామీ ఏమైందని ఆగ్రహం
- పెండింగ్ బకాయిలు చెల్లించి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట వలంటీర్ల ధర్నా

కర్నూలు(అర్బన్): తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదని గ్రామ/ వార్డు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల సమస్యలను పరిష్కరించాలన్న రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ (ఏఐవైఎఫ్ అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వందల సంఖ్యలో జిల్లాలోని వలంటీర్లు హాజరయ్యారు. వలంటీరు కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసులు, వలంటీర్ అసోసియేషన్ నేతలు సుకన్య, నూర్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వలంటీరు వ్యవస్థను కొనసాగించడంతో పాటు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని నమ్మపలికారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు గడుస్తున్నా, నేటికి వలంటీరు వ్యవస్థపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60 లక్షల మంది వలంటీర్ల గురించి ప్రభుత్వం పట్టించుకోక పోవవడం శోచనీయమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేశారన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడడం వల్ల వలంటీర్లు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. రాజకీయ ఒత్తిళ్ల వల్ల రాజీనామాలు చేసిన వలంటీర్లను కూడా వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. యుద్ధప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వలంటీర్ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు చంటి, సురేంద్రయాదవ్, రాజశేఖర్, వలంటీర్లు ప్రభాకర్, రాజశేఖర్, భరత్, గౌసియా, రామాంజనేయులు, మద్దిలేటి, బోయ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తిన ఉల్లి

- రికార్డు స్థాయిలో విక్రయానికి 12,611 క్వింటాళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 389 మంది రైతులు 12,611 క్వింటాళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. రైతులు ఊహించిన విధంగా ధరలు తగ్గడం ఆందోళన మిగిల్చింది. వ్యాపారులు సిండికేట్ కావడం కూడా ధరలు తగ్గడానికి ఒక కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్వింటాకు కనిష్టంగా రూ.297, గరిష్టంగా రూ.3,660 లభించింది. సగటు ధర రూ.2,218 మాత్రమే నమోదైంది.

➢ సజ్జల ధర మరింత పడిపోయింది. మార్కెట్‌కు 24 మంది రైతులు 236 క్వింటాళ్ల సజ్జలు తెచ్చారు. కనిష్ట ధర రూ.1,941, గరిష్ట ధర రూ.2071 లభించగా.. సగటు ధర రూ.2,065 లభించింది.

➢ వేరుశనగ ధర కూడా తగ్గిపోయింది. మార్కెట్‌కు 1,189 క్వింటాళ్ల వేరుశనగ వచ్చింది. కనిష్ట ధర రూ.3,265, గరిష్ట ధర రూ.6,900 లభించగా.. సగటు ధర రూ.5,066 నమోదైంది.

➢ కొర్రలకు కనిష్ట ధర రూ.2,049, గరిష్ట ధర రూ.3,019 లభించగా.. సగటు ధర రూ.2,519 నమోదైంది.

నేడు మార్కెట్‌కు ఉల్లిగడ్డలు తేవద్దు

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం ఉల్లిగడ్డలు తీసుకురావద్దని ఎంపిక శ్రేణి సెక్రటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. సోమవారం మార్కెట్‌కు రికార్డు స్థాయిలో ఉల్లి విక్రయానికి రావడంతో గోదాములు, షెడ్లు, మాదవాచారి షెడ్లు పూర్తిగా నిండిపోయాయన్నారు. ఉల్లిగడ్డలను లారీల ద్వారా బయటకు పంపేందుకు ట్రాఫిక్ సమస్య ఏర్పడిందన్నారు. అందువల్ల రైతులు 1వ తేదీ మంగళవారం మార్కెట్‌కు ఉల్లి తీసుకురావద్దని ఒక ప్రకటనలో కోరారు.

ఎక్సైజ్ శాఖలో కొనసాగుతున్న బదిలీలు

- పీసీలు 136, హెచ్‌సీలు 68 మందికి స్థానచలనం
- ఏడుగురికి హెచ్‌సీలుగా పదోన్నతి



ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు, అసోసియేషన్ సభ్యులు

కర్నూలు: ఎక్సైజ్ శాఖలో విడతల వారీగా బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. సెబ్ విభాగంలో ఉన్న వారికి ఎక్సైజ్ శాఖకు కేటాయించడమే కాక వారిని బదిలీ చేసి పోస్టింగులు కూడా కేటాయించారు. మొదటగా డీసీ, ఏసీ, ఈఎస్, ఏఈఎస్, సీఐ, ఎస్‌ఐలకు విడతల వారీగా బదిలీలు జరగ్గా ఉమ్మడి జిల్లాలో 136 మంది కానిస్టేబుళ్లు, 68 మంది హెడ్ కానిస్టేబుళ్లకు సోమవారం స్థానచలనం కల్పిస్తూ కర్నూలు నోడల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడుగురికి హెచ్‌సీలుగా పదోన్నతి

జిల్లా ఎక్సైజ్ శాఖలో హెడ్ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నందున వయస్సు పైబడుతున్న ఏడుగురికి పదోన్నతి కల్పించాలన్న హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏడుగురు కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ నోడల్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు ఉత్తర్వులు ఇచ్చారు. జి.రాజు, జి.లక్ష్మన్న, ఎస్.చెన్నయ్య, ఎం.రామకృష్ణుడు, జి.జగన్నాథం, ఏఎంఎం మాలవ్య, సి.లక్ష్మన్న తదితరులు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ అండ్ హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ నాయకులు ఓబులేసు, మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు సోమవారం నోడల్ సూపరింటెండెంట్‌ను కలసి సంతోషం వ్యక్తం చేశారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌కు వీడ్కోలు



కర్నూలు: కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ రవిశంకర్ సుదీర్ఘకాలం పాటు ఏపీఎస్పీ విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం రెండవ పటాలం పరేడ్ గ్రౌండ్‌లో దవాయి పరేడ్ నిర్వహించి కమాండెంట్ రవిశంకర్, వినుత రెడ్డి దంపతులకు శాలువ కప్పి పటాలం సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను పలువురు వక్తలు ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో సహాయ కమాండెంట్లు కేశవరెడ్డి, రవికిరణ్, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, సాపుద్దీన్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఎస్‌ఐలు, పటాలం సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంపై ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ 'గొర్రెల పెంపకం'పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి అక్టోబరు 7వ తేదీ నుంచి 10 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు ఉండి చదవడం, రాయడం వచ్చి ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువకులు ఆరు పోటోలు, రేషన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, విద్యార్హత ధ్రువపత్రాల నకళ్లతో కల్లూరు తహసీల్దారు కార్యాలయం పక్కన కెనరా బ్యాంకు హౌసింగ్ బోర్డు బ్రాంచీ పైన (మూడవ అంతస్తు) సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90007 10508 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. దరఖాస్తులను cbrsetikurnool@gmal.com వెబ్‌సైట్ ద్వారా కూడా పంపవచ్చని సూచించారు.

466 పశువుల షెడ్లకు పరిపాలన అనుమతులు

- ఆదోని, పత్తికొండ మండలాలకు కేటాయించిన వాటి కంటే ఎక్కువ షెడ్లకు అనుమతులు
- ఉపాధి నిధులు రూ.9.09 కోట్లు మంజూరు
- టీడీపీ కార్యకర్తలకే పశువుల షెడ్లు మంజూరు

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొదటి విడతలో 466 పశువుల షెడ్ల నిర్మాణాలకు జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పరిపాలన అనుమతులు ఇచ్చారు. జిల్లాకు 1200 పశువుల షెడ్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ షెడ్లకు అర్హులైన రైతులను పశుసంవర్థక శాఖకు చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లు, ఏరియా పశువైద్యశాలల ఏడీలు ఎంపిక చేసి ఉపాధి హామీకి చెందిన ఏపీఓలకు ఇవ్వాల్సి ఉంది. అయితే లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను పశుసంవర్థక శాఖ అధికారలు సంబంధిత ఎమ్మెల్యేలకు అప్పగించారు. వారు తమ పార్టీ నేతలతో చర్చించి జాబితాలో టిక్ వేసి ఇస్తున్నారు. దీనిని బట్టి పశువుల షెడ్లు టీడీపీ కార్యకర్తలకే మంజూరైనట్లు తెలుస్తోంది. నిజమైన రైతులకు అన్యాయం జరుగుతోంది. మొదటి విడతలో 17 మండలాలకు సంబంధించి 466 పశువుల షెడ్లకు అనుమతులు ఇవ్వగా ఇందులో ఆదోని మండలానికి 70 కేటాయించగా..82 షెడ్లకు పరిపాలన అనుమతులు లభించడం గమనార్హం. ఆదోనిలో టీడీపీ, బీజేపీ నేతల నుంచి వత్తిడి ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువగా మంజూరయ్యాయి. పత్తికొండ మండలానికి 45 కేటాయించగా... 66 పశువుల షెడ్లుకు పరిపాలన అనుమతులు లభించాయి. ఆస్పరికి 28, సి.బెళగల్‌కు 24, దేవనకొండకు 14, గూడూరుకు 13, హాలహర్వికి 40, కల్లూరుకు 26, కోడుమూరుకు 6, క్రిష్ణగిరికి 49, కర్నూలుకు 16, నందవరం 17, ఓర్వకల్లుకు 20, పెద్దకడుబూరుకు 25, తుగ్గలికి 3, వెల్దుర్తికి 18, ఎమ్మిగనూరు మండలానికి 19 ప్రకారం షెడ్లు కేటాయించారు. మంజూరు అయిన షెడ్లకు ఉపాధి హామీ పథకం కింద 90 శాతం నిధులు రూ.9.09 కోట్లు మంజూరయ్యాయి. లబ్ధిదారుల తమ వాటా కింద రూ.1.01 కోట్లు భరించాల్సి ఉంది. మొత్తంగా రూ.10.10 కోట్లతో పశువుల షెడ్లు నిర్మించడానికి రంగం సిద్ధమైంది.

జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి

- సీఎం చంద్రబాబుకు సీపీఐ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఎం చంద్రబాబును సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి సీఎం హోదాలో పత్తికొండకు వస్తున్న నేపథ్యంలో జిల్లాకు ఇచ్చిన హామీలను గుర్తు చేసుకోవాలన్నారు. వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాలువ, హంద్రీనీవా ద్వారా 106 చెరువులకు నీళ్లు నింపుకోవడం ఇంకెప్పుడని ప్రశ్నించారు. పత్తికొండ నియోజకవర్గానికి టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ, నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవాతో నింపడం చేస్తానని చెప్పినా నెరవేర్చలేదన్నారు. పశ్చిమ ప్రాంతంలో దుర్భిక్షం నెలకొని ప్రజలు వలస వెళ్తున్నారని, ఇక్కడ పరిశ్రమలను స్థాపించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో నాయకులు కె.జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువకుడి దారుణహత్య



మృతి చెందిన సాయిమనోహర్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం వేకువజామున ఈ ఘటన జరిగింది. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని స్థానిక గుడిపాటిగడ్డ వీధికి చెందిన సాయిమనోహర్ (27) కర్నూలు నగరంలో మొబైల్ సర్వీస్ షాప్ నడుపుతూ అప్పుడప్పుడు ఊరికి వస్తుంటాడు. ఈ యువకుడి ఇంటి సమీపంలో దుర్గాప్రసాద్ అనే పెయింటర్ తన భార్యతో కలిసి ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం ఇంటికి వెళ్లిన మనోహర్ సోమవారం రాత్రి అతను లేని సమయంలో ఇంట్లోకి వెళ్లాడు. ఇతర ప్రాంతాల్లో పెయింటింగ్ పని ముగించుకుని వేకువజామున 3 గంటల ప్రాంతంలో దుర్గాప్రసాద్ ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో తన భార్యతో కలిసి మనోహర్ ఉండటం చూసి ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో అతను హతుడిపై బలమైన వస్తువులతో దాడి చేయటంతో మోకాలికి, ఛాతికి గాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. తర్వాత నిందితుడు వన్‌టౌన్ పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మనోహర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తన భార్యతో సాయిమనోహర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతోనే దుర్గాప్రసాద్ హత్య చేసినట్లు సీఐ వివరించారు. మృతుడి వదిన వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.